క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి అభిషేకంలో పాల్గొని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగ దారులు ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని డీఈఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగాదారులకు అపరాధ రుసుం పడకుండా ఆదివారం బిల్లులను వసూలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, వనిపెంట, ఖాజీపేట సెక్షన్ల పరిధిలోని బిల్లు వసూలు కౌంటర్లను తెరిచే ఉంచుతామని డీఈఈ తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారించి చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలోని చెట్లను అక్రమంగా నరికి అమ్ముకున్నారని ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కరెంట్ తీగల సాకుతో అడ్డు వస్తున్నాయని చెప్పి రూ లక్షలు విలువ చేసే చెట్లను నరకడం దుర్మార్గమన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని లేని పక్షంలో ఆర్‌ఎస్‌ఓ తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రక్తదాన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ రూపానంద్

ప్రొద్దుటూరు క్రైం : స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను శనివారం జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ గోపాల్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ రక్తదానం ఒకరి ప్రాణం కాపాడుతుందన్నారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని చెప్పారు. రక్తం ఎవరైనా ఇవ్వచ్చనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను వైద్యాధికారులు అభినందించారు.

పరామర్శ



హమీద్‌ను పరామర్శిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పంచాయతీ మాజీ వార్డు మెంబర్, పార్టీ సీనియర్ నాయకుడు హమీద్‌ను పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల హమీద్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చిన సమాచారం తెలిసి నాగార్జున రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

హోంగార్డు కుమార్తెకు ఎస్పీ ప్రశంస



ఎస్పీచే ప్రశంసా పత్రం అందుకుంటున్న కావేరి

బ్రహ్మంగారిమఠం : మండలంలో పలుగురాళ్ల పల్లి గ్రామానికి చెందిన హోంగార్డు గాబ్రెయిల్ కుమార్తె కావేరి ప్రతిభను గుర్తించి ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ప్రశంసా పత్రం అందజేశారు. కావేరి ఇంటర్మీడియట్‌లో 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కావేరిని ప్రశంసించి క్యాష్ రికార్డు అందజేశారు.

చంద్రన్న 'బీమా' ఏమాయే?

- ఏడాది గడిచినా దరఖాస్తులను స్వీకరించని ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేద కుటుంబాలకు ఆసరా
- ఇప్పటికీ తెరచుకోని వెబ్ సైట్



చంద్రన్న బీమా పథకం లోగో

కాశినాయన : ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతోంది. పథకాల పేర్ల మార్పుతోనే సరిపెట్టుకుంటున్నారు. కనీసం కుటుంబాల్లో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

పేరు మార్పుతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రన్న బీమాగా పేరు మార్చి సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకు పథకం విధి విధానాలు ప్రకటించ లేదు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చారు. గద్దెనెక్కి ఏడాది పూర్తి చేసుకుని సంబరాలు చేస్తున్నారే కానీ పథకం అమలును పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రారంభం కాని వెబ్ సైట్

2024 మే తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత చంద్రన్న బీమాగా మార్చినా వెబ్ సైట్‌ను ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లెయిమ్‌లను స్వీకరించేందుకు మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు. బీమా దరఖాస్తులను స్వీకరించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో కుటుంబ యజమాలను కోల్పోయిన బాధితులు బీమా కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు, 50 నుంచి 60 ఏళ్ల వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10వేలు ఇచ్చేవారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో నామినీ పేరుతో బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. తద్వారా పేద కుటుంబాలకు సత్వర సాయం అందేది. ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని గాలికి వదిలేసింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి వివాదంపై మహిళల నిరసన



సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో ఉన్న ఎస్సీ కాలనీలోని రహదారి వివాదానికి సంబంధించి మహిళలు రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు శనివారం నిరసనకు దిగారు. గ్రామంలో కొన్ని రోజుల నుంచి వెంకటసుబ్బయ్య, దయానిధిల మధ్య సిమెంట్ రోడ్డుకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ విషయమై వీరి మధ్య పలుమార్లు గొడవలు జరుగగా పోలీసులు కేసు నమోదు చేశారు. ముందు జాగ్రత్తగా ఇరువురిని బైండోవర్ కూడా చేశారు. ఈ క్రమంలో రహదారిలో తిరగనివ్వలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ శనివారం స్టేషన్ ముందు మహిళలు ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా తమకు న్యాయం జరగలేదని వారు వాపోయారు. సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకుడు సాల్మన్‌లు మహిళలకు మద్దతుగా నిలిచారు. అదే సమయంలో సీఐ బాలమద్దిలేటి స్టేషన్‌కు రాగా మహిళలు వాహనానికి దారి ఇవ్వలేదు, దీంతో సీఐ బాలమద్దిలేటి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యనారాయణ, సాల్మన్‌లు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

స్థలం ఎవరిదో తేల్చమని రెవెన్యూ వాళ్లకు చెప్పాం

సిమెంట్ రోడ్డు పక్కన ఉన్న ఐదు అడుగుల స్థలం కోసం వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని సీఐ బాలమద్దిలేటి తెలిపారు. స్థలం ఎవరిదో తేల్చాలని రెవెన్యూ అధికారులకు చెప్పామన్నారు. అంత వరకు సంయమనం పాటించాలని సీఐ అన్నారు. అయితే ఇంతలోనే దయానిధికి సంబంధించిన మహిళలు, వారి తరపున సీపీఎం, సీఐటీయూ నాయకులు కలిసి స్టేషన్ ముందు ఆందోళనకు దిగారని చెప్పారు. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. ఎవరైనా ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవో హోంలో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకుని స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహా సభను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 15న రాయచోటిలో నిర్వహించనున్న హిందుస్తానీ అవాం మోర్చా పార్టీ బహుజనుల రాజకీయ చైతన్య మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళా నేతలు రాజేశ్వరి, లక్ష్మీ, కొత్తూరు కవిత తెలిపారు. శనివారం వీరు కొర్రపాడు రోడ్డులోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి జితన్ రామ్ మంజి, రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, నేషనల్ ప్రెసిడెంట్ సంతోష్ సుమన్ హాజరు అవుతారన్నారు.

ఏటీఎం పనిచేయక ఇబ్బందులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణీకుల అవసరాలు తీరేలా కడప ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రయాణీకులకు నగదు అవసరమైతే బస్టాండు వెలుపలికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ కేంద్రం ద్వారా లావాదేవీలు నిర్వహించేవారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మహిళలు, యువతులకు ఈ ఏటీఎం కేంద్రం ఎంతోగానో ఉపయోగపడేది. అలాంటిది ప్రస్తుతం ఏటీఎం పనిచేయకపోవడంతో ప్రతినిత్యం ఏటీఎం గదికి సంబంధించిన షట్టర్ కిందికి వేసి ఉన్నారు. దీంతో ప్రయాణీకులు చేసేది లేక అటు అంబేడ్కర్ సర్కిల్‌కుగానీ, ఇటు హీరోహోండా షోరూం వద్దకు గానీ వెళ్లి నగదును డ్రా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ ఏటీఎం కేంద్రం పనిచేసేలా ఎస్‌బీఐ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించరా..?

కడప ఎడ్యుకేషన్: ప్రజల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని రెవల్యూషనరీ మార్కిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌ఎంపిఐ) రాష్ట్ర కార్యదర్శి గుజ్జల రమణయ్య అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కొప్పర్తి గ్రామ పంచాయితీలో గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇంటిస్థలాలను ఇచ్చి పక్కా గృహాలను గత ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే ఆ కాలనీలో ప్రస్తుత ప్రభుత్వం సిమెంటు రోడ్లుకానీ, మంచినీటి సౌకర్యంగానీ, వీధిలైట్లను గానీ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలపై కూటమి ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమగ్రాభివృద్ధి కోసం పోరాటం చేసేందుకు సిద్ధం

- నియోజకవర్గ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

మైదుకూరు : నియోజకవర్గంతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తులో పోరాటం చేసేందుకు సీపీఐ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. మైదుకూరులో సీపీఐ నియోజకవర్గ మహాసభను శనివారం నిర్వహించారు. మహా సభ ప్రారంభానికి ముందు పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి నుంచి రాయల కూడలి మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. మహా సభలో గాలిచంద్ర మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో కేసీ కాలువ చివరి ఆయకట్టు వరకూ నీరందించాలంటే రాజోలి ఆనకట్ట పూర్తిచేయాల్సి ఉందన్నారు. మూతపడిన పశు దాణా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని, మరిన్ని పరిశ్రమలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులలో నీరున్నప్పటికీ పంట కాలువలు లేకపోవడంతో జిల్లా రైతులు కరవును ఎదుర్కొంటూ పంటలు పండక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టుల, పంట కాలువల, పరిశ్రమల ఏర్పాటుకు భవిష్యత్తు పోరాటాలే శరణ్యమని అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.సుబ్బరాయుడు, పి.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ప్రతి పేదవారికి ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు ఒక హెక్టార్ బంజరుభూమి ఇవ్వాలన్నారు. మహా సభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఎస్.షావలి, సహాయ కార్యదర్శులు పి.పవన్, కె.జయరాజు, బీవీ.శ్రీనివాసులు, బి.పీరయ్య, ఎస్.రహంతుల్లా, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : సీపీఐ జిల్లా మహా సభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రవికుమార్ పిలుపిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23, 24 తేదీల్లో బద్వేలులో 25 వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలు విజయవంతమయ్యేందుకు కార్మికులు, ప్రజాసంఘాలు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. మహాసభల్లో కార్మికులు, రైతులు, విద్యార్థి, యువజన సంఘాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. మహాసభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, జగదీష్, శివారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శులు కేశవ, ఫిరోజ్ పాల్గొన్నారు.

స్మార్టు మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం

జమ్మలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా స్మార్టు మీటర్లను బిగిస్తే అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి మనోహర్ అన్నారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్తు చార్జీలు పెంచబోమని, స్మార్టు మీటర్లు బిగించమని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో స్మార్టు మీటర్లు బిగిస్తే వాటిని పగుల గొట్టాలని ఇచ్చిన పిలుపును వారు మరచిపోయారని ప్రశ్నించారు. ప్రజలపై రెండు సార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారన్నారు. ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలని, స్మార్టు మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసుదాసు, వినయ్‌కుమార్, దాసరి విజయ్, హుస్సేన్‌వలి, అబ్రహం, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



హిటాచీ ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

కడప కార్పొరేషన్: కడప నగరంలో చిలకల బావి వద్ద విద్యుత్ ప్రమాదం జరక్కుండా రెండో శనివారం కాపాడింది. చిలకలబావి వీధిలో కాల్వకట్ట పక్కనున్న కేసీ కెనాల్‌లో కొన్ని రోజులుగా పూడిక తీత పనులు జరుగుతున్నాయి. కేసీ కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని, పూడికను హిటాచీతో ఎత్తి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు హిటాచీ ఆ మార్గంలో వెళుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొద్ది దూరం లాక్కెల్లింది. హిటాచీ ఆలాగే ముందుకు వెళ్లి ఉంటే స్తంభం కింద పడేది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉంటే హిటాచీ డ్రైవర్‌కుగానీ, స్థానికులకుగానీ ప్రమాదం జరిగి ఉండేది. రెండో శనివారం కావడంతో విద్యుత్ సరఫరా లేకపోవడం...డ్రైవర్ అప్రమ త్తమై పోల్ కిందపడకుండా హిటాచీని అడ్డుగా పెట్ట డం వల్ల ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

'బాలవిహార్'లో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రసార భారతి (ఆకాశవాణి)లో శనివారం నిర్వహించిన బాల విహార్ కార్యక్రమంలో కడప శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హెచ్‌ఎం, జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్ ఆధ్వర్యంలో పాల్గొని గేయాలాపన చేశారు. ఇందులో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు దేశభక్తి గేయాలు, సైన్సు, రాజ్యాంగంపైన పాటలు పాడటంతోపాటు ప్లాస్టిక్ భూతంపై ఏక పాత్రాభినయం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎబినేజర్ తెలిపారు. ఈ పాటలు, ఏకపాత్రాభినయంకు సంబంధించిన ప్రసారాలు త్వరలో రేడియోలో వస్తాయని ఆయన తెలిపారు.

విజయ సాధనకు స్పష్టమైన లక్ష్యం ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషి విజయ సాధనకు తొలుత స్పష్టమైన లక్ష్యం ఉండాలన్న విషయాన్ని గుర్తించుకోవాలని విశాఖపట్టణంకు చెందిన రాజయోగిని బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఓంశాంతి భవన్‌లో ఆంధ్ర- కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌ఛార్జి, సీనియర్ రాజయోగిని గీతా బెహన్ ఆధ్వర్యంలో ×విజయం యొక్క రహస్యం్ల అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివలీల అక్కయ్య మాట్లాడుతూ విజయం అనేది సాధారణంగా చేకూరదని, అందుకు నిరంతర కృషి, మీపై, మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచుకోవాలన్నారు.

పైపులు పగిలి.. నిలిచిన నీటి సరఫరా



పైపులు పగిలిన చోట లీకేజీ



ఆదిరెడ్డిపల్లె ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు

మైదుకూరు : మైదుకూరు–తాడిచర్ల రహదారి విస్తరణ పనుల్లో యంత్రాల ధాటికి తాగునీటి పథకం పైపులు పగిలిపోయాయి. మండలంలోని ఆదిరెడ్డిపల్లి సమీపంలో బోరు వేసి నిత్యం తాగునీరు పైపుల ద్వారా ఆ గ్రామంలోని ఇళ్లకు నీటి సరఫరా చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆదిరెడ్డిపల్లె వద్ద డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. రోడ్డు మార్జిన్‌కు సమీపంలో యంత్రాలతో తవ్వుతుండగా తాగునీటి పథకం పైపులు పగిలిపోయాయి. దీంతో బోరు నుంచి వచ్చే నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఆదిరెడ్డిపల్లి వాసులకు తాగునీటి సరఫరా నిలిచి పోయింది. గ్రామంలోని ఆలయం సమీపంలో చేతిపంపు నీటినే వాడుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే రోడ్డు విస్తరణలో పథకం బోరు తొలగించాల్సి ఉందని, మరో చోట కొత్త బోరు ఏర్పాటు చేశారు. పరిహారం కింద సుమారు రూ.4.50 లక్షలు మంజూరైంది. అయితే నీటి పైపులైన్ పగలడంతో సమస్య తలెత్తింది. మూడు రోజులుగా నీటికోసం అవస్థపడుతున్నా అధికారులు, సర్పంచ్ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు.

జింకా సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో మనం ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా జింకా సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్, పద్మ ప్రతిభ జాతీయ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీరామమూర్తి, గ్రంథాలయ అధికారి మారెళ్ల శ్రీనివాసరావు, రైల్వే డివిజనల్ డీఎస్పీ సుబ్బారావు, పత్రికా సంపాదకుడు జాబిలి చాంద్ బాషా, వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, రఘువీర ప్రతాప్, మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లా జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభ

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పల్లా జాతీయ పురస్కారం–2025 ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు యువ సాహితీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు పల్లా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సినీ, టీవీ సీరియల్ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ రచించిన 'మంటలు స్నానం' కవితా సంపుటికి పల్లా జాతీయ పురస్కారం -2025 అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కవితా సంపుటిని సాహితీ విమర్శకులు, న్యాయవాది సీవీ సురేష్ సమీక్షిస్తారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు, కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ప్రముఖ అనువాద రచయిత డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్ హాజరవుతారని వివరించారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం



రోడ్డు నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కొండాపురం: రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొండాపురం ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొండాపురంలో వాహనాదారులకు శనివారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు ధరించాలని ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. మద్యం తాగడం, సెల్ ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో రోడ్డు ప్రమాదాల నుండి బయటపడతారన్నారు. తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కొండాపురంలో ఎస్‌బీఐ సర్కిల్, సీఎంఆర్ కాంప్లెక్స్ సర్కిల్ వద్ద నాలుగు వరుసల జాతీయ రహదారిలో దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ చలో ఢిల్లీ



పోస్టర్లు విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు: కడపలో ఉక్కు పరిశ్రమ హామీ అమలు కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పది రోజుల్లో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని మహానాడులో చంద్రబాబు చెప్పినా, నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. పార్లమెంట్‌లో తీర్మానం చేసిన విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలుచేయకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఒత్తిడి తీసుకువస్తే కచ్చితంగా ప్రత్యేక హోదా సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్, కృష్ణారెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

కడప కార్పొరేషన్: జీవో నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్ నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పెరిగిన ధరలు, విద్యార్థుల ఫీజుల వలన కుటుంబ పోషణ కష్టమై, ఇంటి బాడుగ కట్టుకోలేక కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 4 వ తేదీన విజయవాడలో జరిగిన ధర్నాలో తాము సమ్మె ప్రకటించి, ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాము విధిలేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, క్యాడర్ స్ట్రెంగ్త్ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ప్రకటించాలన్నారు. తాము సమ్మె చేస్తుంటే వార్డు అమినేటిస్ సెక్రెటరీ లతో పని చే యించుకోవాలని చూస్తున్నారని, వాల్వులు తిప్పే క్రమంలో పైపులైన్ సమస్యలు వస్తే కమిషనరే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్ర రెడ్డి, జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఆనంద రావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ నగర ప్రధాన కార్యదర్శి కేశవులు, వాటర్ నాయకులు ఓ సుబ్బారాయుడు, గురువయ్య, గోవర్ధన్, చాపయ్య పాల్గొన్నారు.